మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

మంగళవారం 9 జూన్ 2026 పేజీలు : 4

## ఫిర్యాదులపై ఫోకస్

43 అర్జీలు స్వీకరణ

బాధితులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ..

త్వరిత విచారణకు అధికారులకు ఆదేశాలు..



ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 43 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిపై సత్వర విచారణకు అధికారులను ఆదేశించారు.

బాపట్ల రక్షణ న్యూస్



వివరాలు 2లో..

## సోమేశ్వరుడి సొమ్ము ఎవరి జేబుల్లో...?

దాతల విరాళాల మాయం వెనుక భారీ అవకతవకల కోణం!

- సెల్ఫ్ చెక్కులతో లక్షల డ్రా?
- ఈవోపై ఎమ్మెల్యే ఆగ్రహం
- తూర్పు సత్రం నిధులపై కొత్త అనుమానాలు
- దేవాలయ పనులు నిలిచిపోవడంతో భక్తుల ఆవేదన

2లో.

సోమేశ్వర దేవాలయ దాతల విరాళాల మాయం వ్యవహారం ఇప్పుడు రాజకీయ, అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది. సెల్ఫ్ చెక్కుల ద్వారా లక్షల రూపాయలు డ్రా చేసిన వ్యవహారంపై ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏడాదిగా కొనసాగుతున్న ఈ వ్యవహారం ఇప్పటివరకు తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని కమిటీ సభ్యులు, అధికారులను నిలదీసినట్లు తెలిసింది. దేవుడి సొమ్ము దోచుకున్న వారిని ఎంతటి వారైనా వదిలేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించినట్లు సమాచారం.

బాపట్ల రక్షణ న్యూస్



వివరాలు 2లో..

## బాపట్ల రాజకీయాల్లో 'శివ'శక్తి..?

### జనసేన ఫోకస్‌లో గుండ్రెడ్డి శివ అన్న ప్రచారం

- పవన్ దృష్టిలో బాపట్ల...శివ పేరు
- చర్చలోకి సామాజిక సమీకరణాల లెక్కలు
- ఇండిపెండెంట్ ఆలోచనలో శివ.....?
- జనసేనలోకి ఎంట్రీ అయితే సూపర్ సక్సెస్ అంటున్న అభిమానులు...

ఉమ్మడి గుంటూరు రక్షణ బ్యూరో

బాపట్ల రాజకీయాల్లో సైలెంట్‌గా ఉన్నా... గ్రౌండ్ లెవెల్‌లో బలమైన నేతగా గుర్తింపు తెచ్చుకున్న గుండ్రెడ్డి శివ పేరు ఇప్పుడు జనసేన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బాపట్లలో పార్టీ బలహీనంగా ఉందన్న నివేదికల నేపథ్యంలో అన్ని వర్గాలను కలుపుకొని వెళ్లగలిగే నాయకుడి కోసం జనసేన అధిష్టానం అన్వేషణ ప్రారంభించగా, కాపు, బీసీ, ఎస్సీ వర్గాల్లో పట్టు కలిగిన శివ వైపు పవన్ కళ్యాణ్ దృష్టి వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

"గ్రౌండ్ లెవెల్‌లో బలమైన నాయకుడిగా గుండ్రెడ్డి శివ..." బాపట్లలో జనసేనకు కొత్త రాజకీయ ఆశాకిరణంగా మారుతున్నారా..?

"కాపు-బీసీ-ఎస్సీ వర్గాల్లో శివకు పెరుగుతున్న ఆదరణ..." బాపట్ల రాజకీయ సమీకరణాల్లో శివ పేరు ఇప్పుడు హాట్ టాపిక్

## నేరస్తులకు డ్రగ్ టెస్టులు

120 మందికి యూరిన్ పరీక్షలు

17 మందికి పాజిటివ్ నిర్ధారణ..

పాజిటివ్ వారికి జైలు శిక్ష



2లో.

గుంటూరు నగరంలోని పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులపై పోలీసులు నిర్వహించిన ఎన్డీపీఎస్ పరీక్షల్లో 17 మంది మత్తు పదార్థాలు వినియోగించినట్లు తేలింది. పాజిటివ్ వచ్చిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు.

గుంటూరు రక్షణ న్యూస్

## ప్రజల మధ్యే సీఎస్ సాయి ప్రసాద్..

గుంటూరు పీజీఆర్ఎస్‌లో ప్రత్యేక దృష్టి

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ



2లో.

గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం విశేషంగా నిలిచింది. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన... దాదాపు మూడు గంటల పాటు రెవెన్యూ క్లినిక్‌లో కూర్చొని ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు అధికారుల పనితీరును నేరుగా పరిశీలించారు. దివ్యాంగుల వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తీరు ఆకట్టుకుంది.

# ఫిర్యాదులపై ఫోకస్

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వ్రాతపూర్వకంగా 43 అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా విన్నారు.ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ, సమస్యల పూర్తి వివరాలను తెలుసుకుని చట్టపరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఎస్పీ హెచ్చరించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరస్తులకు డ్రగ్ టెస్టులు

గుంటూరు రక్షణ న్యూస్

నగరంలోని ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న 120 మందికి పోలీసులు యూరిన్ టెస్టులు నిర్వహించారు. వీరిలో 17 మంది మత్తు పదార్థాలు వినియోగించినట్లు పరీక్షల్లో నిర్ధారణ కావడంతో వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 400 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగంలో పదేపదే పాల్గొంటున్న 10 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు వెల్లడించారు.మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా జిల్లాలో ఇప్పటికే 230 'సంకల్ప్' అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. గంజాయి వినియోగం వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.తాజా పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి నుంచి మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి చేరుతున్నాయనే అంశంపై ప్రత్యేక దర్యాప్తు చేపడుతున్నామని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

# బాపట్ల రాజకీయాల్లో 'శివ' శక్తి..?

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి గుంటూరు రక్షణ బ్యూరో

బాపట్ల రాజకీయాల్లో మళ్లీ గుండ్రెడ్డి శివ పేరు బలంగా వినిపిస్తోంది. ప్రత్యక్ష రాజకీయాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ... క్షేత్రస్థాయిలో ఆయన ప్రభావం మాత్రం తగ్గలేదన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా జనసేన పార్టీ బాపట్లలో కొత్త రాజకీయ సమీకరణాల కోసం ప్రయత్నాలు ప్రారంభించిందన్న ప్రచారం నేపథ్యంలో గుండ్రెడ్డి శివ పేరు ఒక్కసారిగా ఫోకస్‌లోకి వచ్చింది.రాష్ట్రవ్యాప్తంగా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. పార్లమెంట్, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక కమిటీలు వేసి పార్టీ పరిస్థితులపై నివేదికలు సేకరిస్తున్న జనసేన... బాపట్ల నియోజకవర్గ పరిస్థితిపై కూడా ఆరా తీసినట్లు సమాచారం.ఈ క్రమంలో బాపట్లలో పార్టీకి బలమైన నాయకత్వం లేకపోవడం, క్షేత్రస్థాయిలో పార్టీ బలహీనపడిందన్న నివేదికలు పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లగలిగే నాయకుడి కోసం జనసేన ప్రత్యేకంగా అన్వేషణ ప్రారంభించినట్లు సమాచారం.

....అక్కడే గుండ్రెడ్డి శివ పేరు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది....

బాపట్ల రాజకీయాల్లో రెండు దశాబ్దాలుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివ... సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో గ్రామస్థాయిలో బలమైన నెట్‌వర్క్ నిర్మించుకున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా కాపు సామాజిక వర్గంలో మంచి పట్టు కలిగి ఉండటమే కాకుండా... బీసీ, ఎస్సీ వర్గాల్లో కూడా ఆయనకు ప్రత్యేక ఆదరణ ఉందన్నది స్థానిక రాజకీయ వర్గాల అభిప్రాయం.పార్టీలకతీతంగా అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం, అవసర సమయంలో నాయకులకు అండగా నిలిచే తీరు, క్షేత్రస్థాయి పరిచయాలు... ఇవన్నీ ఇప్పుడు ఆయనను మళ్లీ రాజకీయంగా చర్చలోకి తెచ్చాయి.

అయితే ఇదే సమయంలో మరో ఆసక్తికర అంశం కూడా వినిపిస్తోంది. గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటూ వెళ్లడం వెనుక తీవ్ర అసంతృప్తి ఉందన్న ప్రచారం సాగుతోంది. ఏ పార్టీకి ఎంత చేసినా సరైన గుర్తింపు రావడం లేదనే భావన శివలో పెరిగినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.రాజకీయ అవసరాల కోసం మాత్రమే వాడుకుని... తర్వాత పక్కన పెట్టేస్తున్నారనే ఆలోచన ఆయనకు తీవ్ర మనస్తాపం కలిగించిందని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

అందుకే ప్రస్తుతం ఏ పార్టీకి దగ్గరగా కాకుండా సైలెంట్‌గా ఉంటూ పరిస్థితులను గమనిస్తున్నట్లు సమాచారం.

నిశ్శబ్దమే ఇప్పుడు రాజకీయాల్లో ఆసక్తికర చర్చ.....

కూటమి ప్రభుత్వంలో కూడా యాక్టివ్ రాజకీయాలకు దూరంగా ఉండటం... వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం కూడా బాపట్ల రాజకీయాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా యువత, గ్రామస్థాయి నాయకత్వంలో ఆయనకు ఉన్న ఫాలోయింగ్‌ను గమనించిన జనసేన... శివను పార్టీలోకి తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

పవన్ కళ్యాణ్ పార్టీని కేవలం సోషల్ మీడియా స్థాయిలో కాకుండా... బూత్ స్థాయిలో బలపడేలా చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా బలమైన సామాజిక, రాజకీయ ప్రభావం ఉన్న నేతలను గుర్తించే పనిలో జనసేన నిమగ్నమైందని సమాచారం.బాపట్లలో ఆ ప్రమాణాలకు దగ్గరగా ఉన్న నాయకుడిగా గుండ్రెడ్డి శివ పేరును పార్టీ అంతర్గత నివేదికలు సూచించినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఇప్పటికే బాపట్ల నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గ ఓటు బ్యాంక్ కీలకంగా ఉండగా... బీసీ, ఎస్సీ వర్గాల్లో కూడా ప్రభావం కలిగిన నాయకుడి అవసరం జనసేనకు ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లెక్కలన్నింటిలోనూ శివ పేరు సరిపోతుందన్న చర్చ జరుగుతోంది.

మరోవైపు శివ అనుచరులు కూడా తమ నేతకు తగిన రాజకీయ గుర్తింపు రావాలని బహిరంగంగానే అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. "ఎన్నో సందర్భాల్లో నాయకులకు అండగా నిలిచినా... సరైన ప్రాధాన్యం మాత్రం దక్కలేదు" అన్న అసంతృప్తి ఆయన వర్గంలో కనిపిస్తోందని సమాచారం.ఇలాంటి పరిస్థితుల్లో జనసేన నిజంగానే గుండ్రెడ్డి శివకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా..? బాపట్లలో కొత్త రాజకీయ ప్రయోగానికి శ్రీకారం చుడుతుందా..? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో వేడెక్కుతోంది.

అయితే ఇప్పటివరకు శివ మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ ఆయన చుట్టూ జరుగుతున్న రాజకీయ చర్చలు మాత్రం బాపట్ల రాజకీయ సమీకరణాలను మార్చే స్థాయిలో ఉన్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మరి గుండ్రెడ్డి శివ జనసేన వైపు అడుగులు వేస్తారా..? లేక స్వతంత్ర రాజకీయాలకే మొగ్గు చూపుతారా..? అన్నది రాబోయే రోజుల్లో బాపట్ల రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# ప్రజల మధ్యే సీఎస్ సాయి ప్రసాద్..

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్వయంగా కార్యక్రమానికి హాజరై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, అధికారుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రజా సమస్యల్లో ఎక్కువ భాగం రెవెన్యూ శాఖకు సంబంధించినవే వస్తుండటంతో ఇటీవల ప్రత్యేక రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు చేరుకున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేరుగా రెవెన్యూ క్లినిక్‌లోకి వెళ్లారు.సాధారణంగా ఉన్నతాధికారులు సమావేశ మందిరాల్లో సమీక్షలు నిర్వహించడం కనిపిస్తుంటే... సీఎస్ జి.సాయి ప్రసాద్ మాత్రం ప్రజల మధ్య కూర్చొని వారి సమస్యలను ఓర్పుగా విన్న తీరు అక్కడికి వచ్చిన వారిని ఆకట్టుకుంది. దాదాపు మూడు గంటల పాటు రెవెన్యూ క్లినిక్‌లోనే ఉండి వివిధ కౌంటర్ల వద్దకు వెళ్లి అర్జీల స్వీకరణ విధానాన్ని పరిశీలించారు.ప్రజలతో అధికారులు ఎలా వ్యవహరిస్తున్నారు... సమస్యలను ఏ విధంగా స్వీకరిస్తున్నారు... పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు వంటి అంశాలను నేరుగా గమనించారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సమ స్యల స్వభావం, పెండింగ్ కారణాలు, పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.ప్రత్యేకంగా తరచుగా వస్తున్న రెవెన్యూ సమస్యలపై అధికారులతో చర్చించారు. భూవివాదాలు, పాస్‌బుక్ సమస్యలు, వారసత్వ వివాదాలు, సర్వే అంశాలు, ఆన్‌లైన్ నమోదు సమస్యలు వంటి అంశాలపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేస్తున్నట్లు గుర్తించిన సీఎస్... సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు అవసరమని అధికారులకు సూచించినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కూడా సీఎస్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సాధారణ అధికారిలా ప్రజల మధ్య కూర్చొని సమస్యలు వింటూ వారికి వివరణలు ఇస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తీరు అక్కడి అధికారులకు సైతం ప్రత్యేక సందేశాన్ని ఇచ్చింది.ఇదిలా ఉండగా కార్యక్రమంలో మరో మానవీయ కోణం కూడా కనిపించింది. ప్రజా సమస్యలు వినిపించేందుకు కొంతమంది దివ్యాంగులు వీల్‌చైర్లలో, మరికొందరు ఆటోలలో వచ్చారు. వారి పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ "మీరు ఎక్కడ ఉంటే... మేము అక్కడకే వస్తాం" అంటూ స్వయంగా వారి వద్దకు వెళ్లి అర్జీలు స్వీకరించారు.

దివ్యాంగులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను ఓర్పుగా తెలుసుకున్నారు. వారికి ఎక్కువసేపు ఇబ్బంది కలగకుండా వెంటనే సంబంధిత అధికారులను పిలిచి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ చూపిన ఈ మానవీయ స్పందన అక్కడి వారిని ఆకట్టుకుంది.పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై మరింత నమ్మకం పెరగాలని, సమస్యలు పెండింగ్‌లో లేకుండా పరిష్కారం దిశగా అధికారులు పనిచేయాలని సీఎస్ సూచించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే వారికి సరైన స్పందన లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో... పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు ఎక్కువగా రావడంతో ప్రత్యేక క్లినిక్‌ల ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయిజిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో షేక్ ఖాజావలి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం..

## గొట్టిపాటి లక్ష్మి..

**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అద్దంకి ఆర్డీఓ విజయజ్యోతి, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఎంపీడీవో తదితర శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను నమోదు చేసుకున్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు అందినట్లు డాక్టర్ లక్ష్మీ తెలిపారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు చొరవ చూపాలని సూచించారు. తదుపరి ప్రజా దర్బార్‌కు ముందే పరిష్కరించగలిగే సమస్యలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ నిర్ణయం అవసరమైన అంశాలను సంబంధిత శాఖల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విద్యుత్ సమస్యలు, కొత్త పెన్షన్ల మంజూరు, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల కల్పనకు సంబంధించిన వినతులు కూడా పెద్ద సంఖ్యలో అందాయని చెప్పారు. అర్హులైన వారందరికీ త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం



చర్యలు తీసుకుంటోందన్నారు.ముండ్లమూరు మండలంలో ఇప్పటికే లక్షలాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి వచ్చిన వినతిపై వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లే లక్ష్యంతో పనిచేస్తోందని డాక్టర్ లక్ష్మీ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు తోట రామారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు శిక్షణ



**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూ ల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు సోమ వారం 'ఏఐ ఎనేబు ల్డ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్' కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఆరేళ్లలోపు చిన్నారుల శారీరక, మానసిక, భాషా మరియు సామాజిక అభివృద్ధి దశలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి, అభివృద్ధిలో ఏవైనా లోపాలు ఉంటే ముందుగానే తెలుసుకునేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సీడీపీవో పరిమిల తెలిపారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక యాప్ వినియోగ విధానం, చిన్నారుల వివరాల నమోదు, స్క్రీనింగ్ ప్రక్రియ, నివేదికల తయారీ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. చిన్నారుల ఎదుగుదలలో సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి తగిన వైద్య, పోషకాహార సేవలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో అంగన్వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సీడీపీవో సూచించారు. శిక్షణలో మండలంలోని పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# కమిషనర్ కు శుభాకాంక్షలు



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్ హాసిని బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.కమిషనర్ హాసిని నాయకులతో మాట్లాడుతూ బాపట్లను పరిశుభ్రమైన, ప్రణాళికాబద్ధమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, చెత్త నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. "స్వచ్ఛ బాపట్ల" లక్ష్యంగా పట్టణంలోని పారిశుధ్య సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.అలాగే పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రజా ప్రదేశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగవంతమైన సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు.ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు మందపాటి ఆంధ్రయ్య, కర్పూరపు రామారావు, పరిస రమేష్ గౌడ్, చాప సోమయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు శేషు కృష్ణతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నూతన కమిషనర్ హాసినికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాజీ సైనికులకు వైసిపి భరోసా

**బాపట్ల రక్షణ న్యూస్**



మాజీ సైనికుల సంక్షేమానికి భవిష్యత్తులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి అనుకూలంగా ఉన్న మాజీ సైనిక సంక్షేమ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.సమావేశానికి ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావుతో కలిసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, వీరనారీమణులు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులతో చర్చించారు.సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మాజీ సైనికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ త్వరలోనే పార్టీ తరఫున ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాజీ సైనికులకు అర్హత ఉన్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సైనికుల కోసం చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలపై త్వరలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక (రూట్ మ్యాప్) సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ, మాజీ సైనికుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయడం, వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. మాజీ సైనికులకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడాన్ని స్వాగతించారు. శాసన మండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మాజీ సైనిక సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆకస్మిక సోదాలు



**మార్కాపురం రక్షణ న్యూస్**

మార్కాపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ నాగరాజు నేతృత్వంలో చేపట్టిన ఈ తనిఖీల్లో పోలీసులు కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలను నమోదు చేశారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని కొన్ని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులు తప్పనిసరిగా సంబంధిత ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు.అనంతరం కాలనీవాసులకు పోలీసులు అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల వంటి సామాజిక రుగ్మతలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని పోలీసులు తెలిపారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/9/2026 5:23 AM Page 4



# వీఆర్వోలకు న్యాయం చేయాలి




మార్టూరు రక్షణ న్యూస్

కర్నూలు జిల్లాకు చెందిన గ్రామ రెవె న్యూ అధికారి (వీఆర్వో) మహమ్మద్ హుస్సేన్ అకాల మరణం పట్ల మా ర్టూరు గ్రామ రెవె న్యూ అధి కారులు ప్రగాఢ సం తాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సంఘం తరపున సానుభూతి తెలియజేస్తూ, వీఆర్వోలు ఎదు ర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.గ్రామ రెవెన్యూ అధికారులపై పెరుగుతున్న పని ఒత్తిడి, సిబ్బంది కొరత, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలను ప్రస్తావిస్తూ మార్టూరు మండల తహశీల్దార్ శ్రీమతి టి. ప్రశాంతికి వినతిపత్రం సమర్పించారు. వీఆర్వోల సేవా పరిస్థితులను మెరుగుపరిచేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రత్నరాజు, మోహన్ నాయక్, రాంబాబు, మోహన్ రావు, రోశయ్య, ఉమా మహేశ్వరరావు, సాయి విమల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రహదారి వరం



గురజాల రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా గురజాల మ ండలం గొట్టిముక్కల గ్రామ ంలో రైతుల రాకపోకల సౌ కర్యార్థం చేపట్టిన పొలాల రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామ పెద్ద రాయపాటి రవికుమార్ ఆధ్వర్యంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పొలాల బాటను వేగవంతంగా నిర్మించారు. ఈ రహదారి నిర్మాణంతో రైతులు తమ వ్యవసాయ భూములకు సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ రైతుల అవసరాలను గుర్తించి రహదారి నిర్మాణం పూర్తి చేయించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివా సరావుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. రహదారి పనుల ను నాణ్యతతో పూర్తి చేసిన కాంట్రాక్టర్లను ప్రజలు అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రొండి పోలేరాజు, రొండి బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రొండి సాంబయ్య, చెవిటి పుల్లయ్య, బొల్లం నాగరాజు, ఆవుల చిన్న, జలబోయిన వెంకీతో పాటు పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జీవనోపాధి దెబ్బతీయొద్దు

బాపట్ల రక్షణ న్యూస్

సూర్యలంక సముద్ర తీరంలో ఏళ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలను అభివృద్ధి పేరుతో తొలగించడం సరికాదని సీఐటీయూ నాయకుడు కె. శరత్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు సూర్యలంక బీచ్ వెండర్స్ యూనియన్ తరఫున వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూర్యలంక బీచ్ ప్రాంతంలో తోపుడు బండ్లు, ఐస్‌క్రీం బండ్లపై వ్యాపారం చేస్తూ సుమారు 60 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. పర్యాటక అభివృద్ధి పేరిట వీరిని అక్కడి నుంచి తొలగిస్తే వారి జీవనాధారం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార కుటుంబాలకు చెందిన ఈ వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో సముద్రతీర వ్యాపారమే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. కేవలం 20 మందికి మాత్రమే అనుమతులు ఇచ్చి మిగిలిన 40 కుటుంబాలను



వ్యాపారాలకు దూరం చేయడం అన్యాయమన్నారు. సముద్రతీర ప్రాంతంలో అందరికీ సమానంగా వ్యాపార అవకాశాలు కల్పించి వారి జీవనోపాధిని కాపాడాలని అధికారులను కోరారు. పర్యాటక అభివృద్ధి ఎంత ముఖ్యమో, బలహీన వర్గాల జీవనోపాధి కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం గుర్తించాలని ఆయన అన్నారు. మిగిలిన కుటుంబాల ఉపాధికి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యలంక బీచ్ వెండర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె. లక్ష్మి, కార్యదర్శి ఓ. స్వాతి, నాయకులు ఎన్. దుర్గ, కె. భూలక్ష్మి, ఎ. తిరుపతమ్మ, వి. తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నేతలు



కర్లపాలెం రక్షణ న్యూస్

కర్లపాలెం మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్ర కుమార్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తూ, రెవెన్యూ సేవలను పారదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ బాజీ, నక్కల వెంకటస్వామి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, మద్దాల ముసలయ్య, మాడా శ్రీనివాసరావు, కట్టా సుజాత, ఉర్లమ్మ, ఈ. చంద్రశేఖర రెడ్డి, బుల్లయ్య, కరీముల్లా ఖాన్, సయ్యద్ రఫీ, మీరయ్య, ముదునూరి రామరాజు, అంగిరేకుల ఏడుకొండలు, రావి రాంబాబు రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, మేకల ఇర్మియ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మాచర్ల రక్షణ న్యూస్




మాచర్ల పట్టణంలోని రామా టాకీస్ థియేటర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటనలో నష్టపోయిన టీడీపీ మైనారిటీ నాయకుడు షేక్ జానీని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరామర్శించారు. ఘటన అనంతరం బాధితుడిని కలిసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా థియేటర్‌లో జరిగిన ఆస్తి నష్టంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ, అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారుల ద్వారా తెలుసుకుని అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాసముద్రాల సంరక్షణే ధ్యేయం

బాపట్ల రక్షణ న్యూస్

భూగోళ మనుగడకు, మానవాళి జీవనానికి మూలాధారమైన మహాసముద్రాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బాపట్ల జిల్లా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఛైర్మన్ ఆవల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహాసముద్రాల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాపట్ల జిల్లా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సముద్రాల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ కార్యాలయంలో ప్రజలకు, పర్యావరణ ప్రేమికులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆవల వెంకటేశ్వర్లు కరపత్రాన్ని ఆవిష్కరించారు. రోజురోజుకూ పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయన కాలుష్యం, జల కాలుష్యం కారణంగా సముద్ర పర్యావరణ వ్యవస్థ తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర కాలుష్యం పెరగడం వల్ల సముద్ర జీవసంపద క్షీణించడంతో పాటు అంతర్జాతీయ వాణిజ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా




ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా సముద్రాలను పరిరక్షించవచ్చని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, ఉచిత మొక్కల పంపిణీ అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కౌన్సిల్ సభ్యులు గురజాల శ్రీనివాసరావు, కుర్ర కృష్ణభగవాన్, రోజు సంస్థ కార్యదర్శి పి. ప్రసాద్‌రావు, దేవరకొండ రాము, పి. వీరాస్వామి, ఆర్డీవ తడికమళ్ల నాగేంద్రప్రసాద్, ఉప్పే నరసింహారావు, జయం వరబాబు తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్వరుడి సొమ్ము ఎవరి జేబుల్లో..?

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ బ్యూరో**

బాపట్లలోని ప్రసిద్ధ సోమేశ్వర దేవాలయం నిధుల మాయం వ్యవహారం రోజురోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. ఆలయానికి భక్తులు, దాతలు ఇచ్చిన విరాళాలు... దేవుడి సేవలకు వినియోగించాల్సిన నిధులు... ఇప్పుడు అవినీతి ఆరోపణల మధ్య మాయమయ్యాయన్న ప్రచారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా అప్పటి ఈవో వెంకటేశ్వరరావు సెల్ఫ్ చెక్కుల ద్వారా దాదాపు 11 లక్షల రూపాయలు డ్రా చేశారన్న ఆరోపణలు బయటకు రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ వ్యవహారం రక్షణ దినపత్రికలో వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సీరియస్ అయినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దేవాలయ నిధుల దుర్వినియోగం వంటి అంశం ఇంతకాలం తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని కమిటీ సభ్యులు, అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. "సెల్ఫ్ చెక్కులతో డబ్బులు డ్రా అవుతుంటే కమిటీ సభ్యులు ఏం చేస్తున్నారు..? అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు..?" అంటూ ఎమ్మెల్యే నిలదీసినట్లు తెలుస్తోంది. దేవుడి సొమ్ము దేవుడికే చేరాలని... అవినీతి ఎంత పెద్దదైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై వెంటనే చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని, ఈవో వెంకటేశ్వరరావుపై తక్షణ చర్యలు తీసుకునేలా ఫైల్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. అవసరమైతే దేవాలయ కమిటీనే రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేసే దిశగా కూడా ఆలోచన జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా తూర్పు సత్రం నిధుల వ్యవహారం కూడా ఇప్పుడు కొత్త అనుమానాలకు దారితీస్తోంది. అభివృద్ధి పేరుతో దాదాపు 20 లక్షల రూపాయలకు పైగా వసూళ్లు జరిగాయని... అయితే ఆ డబ్బులు ఎక్కడ ఖర్చయ్యాయో స్పష్టమైన లెక్కలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరు వసూలు చేశారు..? ఎంత మొత్తం వచ్చింది..? ఎక్కడ ఖర్చు చేశారు..? మిగిలిన డబ్బు ఎక్కడుంది..? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానాలు లేవని తెలుస్తోంది. ఈ అంశంపైనా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆరా తీసినట్లు సమాచారం. సమగ్ర లెక్కలు వెంటనే అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. రక్షణ దినపత్రికలో కథనాలు వెలువడే వరకు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహించారని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. కమిటీ సభ్యులు ప్రత్యక్షంగా ఉన్నా... ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా... విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాకపోవడం వెనుక ఏదైనా ఒత్తిడి ఉందా..? లేక వ్యవస్థలోనే లోపాలున్నాయా..? అన్న చర్చ ఇప్పుడు బాపట్లలో జోరుగా సాగుతోంది. ఇక సోమేశ్వర దేవాలయ పరిస్థితి భక్తులను మరింత కలిచివేస్తోంది. ఒకప్పుడు ప్రతి సోమవారం భక్తులతో కిటకిటలాడిపోయే దేవాలయం... ఇప్పుడు రెండు సంవత్సరాలుగా నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. పునాది దశలోనే పనులు ఆగిపోవడంతో భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ అభివృద్ధి కోసం దాతలు ఇచ్చిన విరాళాలు సక్రమంగా వినియోగించి ఉంటే... ఇప్పటికి ఆలయ నిర్మాణం పూర్తయ్యేదని స్థానికులు అంటున్నారు. ఇప్పుడు పనులు తిరిగి ప్రారంభించాలంటే కనీసం పది లక్షల రూపాయల వరకు అవసరమవుతాయని చెబుతున్నారు. అయితే మాయమైన నిధులను తిరిగి ఎవరు తీసుకొచ్చి పెడతారు..? అన్న ప్రశ్న ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతోంది. ఖర్చుల లెక్కలు చూపించకపోతే ప్రభుత్వం నుంచి రావాల్సిన కోటి రూపాయల నిధుల విడుదలకూ ఆటంకం ఏర్పడే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

ఇదే ఇప్పుడు అధికార యంత్రాంగాన్ని ఇబ్బందుల్లోకి నెడుతోంది. ఒకవైపు భక్తుల ఒత్తిడి... మరోవైపు రాజకీయ విమర్శలు... ఇంకోవైపు నిధుల లెక్కల గందరగోళం... ఇలా అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరుగుతోందని సమాచారం.

ఇప్పటికే కొందరు అధికారులు "అయ్యా శివయ్య... ఈ గండం నుంచి బయటపడేలా చూడాలి" అంటూ అంతర్గతంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ప్రజల్లో మాత్రం ఒక్కటే ప్రశ్న వినిపిస్తోంది --- "దేవుడి డబ్బులు మింగిన వారిపై నిజంగానే చర్యలు ఉంటాయా..?"

ఈవోపై కేవలం సస్పెన్షన్ చర్యలతో సరిపెడతారా..? లేక నిజంగా రికవరీ చేస్తారా..? అన్నది ఇప్పుడు కీలక చర్చగా మారింది. రికవరీ చేస్తే ఆ డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి..? ఆస్తులు జప్తు చేస్తారా..? క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేవాలయాల విషయంలో అవినీతికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్న సందేశం ఇవ్వాలంటే ఈ వ్యవహారంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇక తూర్పు సత్రం నిధుల అసలు కథ ఏమిటి..? ఎంత వసూళ్లు జరిగాయి..? ఎక్కడ ఖర్చు చేశారు..? ఎవరి చేతుల్లోకి నిధులు వెళ్లాయి..? అన్న అంశాలపై రక్షణ దినపత్రిక రేపటి సంచికలో ప్రత్యేక కథనం వెలువరించనున్నట్లు సమాచారం. దీంతో బాపట్ల రాజకీయాలు, దేవాలయ వర్గాల్లో మరింత కలకలం రేగే అవకాశం కనిపిస్తోంది.

# గౌరవప్రదమైన భేటీ

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం. హాసిని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పట్టణ సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

కమిషనర్ ఎం. హాసిని మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, బాపట్లను ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.



నూతన కమిషనర్‌కు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. నగర ప్రగతి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సంయుక్తంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ భేటీ బాపట్ల అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేసేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# చంద్రబాబు పాలనపై విమర్శలు



**పెదకూరపాడు రక్షణ న్యూస్**

పెదకూరపాడు నియోజకవర్గం అచ్చంపేట మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "చంద్రబాబు వెన్నుపోటుకు -- రెండేళ్లు" కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ పరిశీలకుడు మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనపై మాజీ ఎమ్మెల్యే శంకరరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. రెండేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందువల్లే ప్రజలు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టును ఆయన ఖండించారు. సంబంధం లేని కేసులో ఇరికించి అప్రజాస్వామికంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# వైసీపీపై ప్రత్తిపాటి విమర్శలు

**చిలకలూరిపేట రక్షణ న్యూస్**



రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వైసీపీ చేస్తున్న విషప్రచారాన్ని కూటమి నాయకులు సమర్థవంతంగా తిప్పికొట్టాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. ఏలూరు పార్లమెంట్ పరిధి కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతుండటాన్ని ప్రజలు గుర్తించకుండా చేయడమే వైసీపీ, జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన అజెండా అని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారులు, పోర్టులు, రైల్వే జోన్, విమానాశ్రయాల అభివృద్ధితో పాటు పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అయితే ఈ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. హింసను ప్రేరేపించడం, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా రాష్ట్రంలో అశాంతి సృష్టించాలన్నదే వైసీపీ వ్యూహమని ఆరోపించారు. ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి పార్టీలు ప్రజల్లోకి బలంగా తీసుకెళితే ప్రతి ఎన్నికలోనూ విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. సమావేశంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.